
"ఇప్పుడు నీ మెడలో ఆ గొలుసు లేకపోతేనేం? నువ్వేమైనా పెళ్ళిళ్ళకూ, పేరంటాలకూ వెళ్ళే పరిస్థితిలో వున్నావా చెప్పు. ఆ గొలుసు నాకిచ్చేయ్. దాన్ని అమ్మి ఒక ఫ్రిజ్ కొనుక్కోవచ్చు. అసలే ఎండా కాలం. కాస్త చల్లగా మంచినీళ్ళు తాగవచ్చు. పళ్ళు, పాలు పెట్టుకోవచ్చు. పిల్లలు కూడా ఫ్రిజ్ కావాలని గోల పెడుతున్నారు. ఇక్కడ నీకు గొలుసు లేకపోతేనేం చెప్పు" అని తను చెప్పవలసిందంతా చెప్పి తల్లి మొహంలోకి చూశాడు సుందర్రావు. కొడుకు మాటలు విని నిశ్చేష్టురాలై కూర్చుండి పోయింది సావిత్రమ్మ. ఆమె చూపులు శూన్యంలోకి చొచ్చుకుపోయాయి.

భర్తపోయి రెండు సంవత్సరాలైంది.

ఆయనతోబాటు ఆమె మాంగల్యం పోయింది. పసుపు కుంకుమలు పోయాయి. కానీ మాతృత్వం పోలేదు. భర్త పోయిన తొలి క్షణాల్లో గుండె నిండా గూడు కట్టుకున్న ఆవేదన, కళ్ళ ముందే అంతా అంధకారమై పోయిన భావన ఆమెను కృంగదీసినప్పుడు, తన ఇద్దరు కొడుకులు ఆమె కళ్ళ ముందు మెదిలారు. తన భర్త విడిచి పెట్టిన తీపి గుర్తులు తనతోనే వున్నారని, తరువాత సర్దుకుని మనసు దృఢం చేసుకుంది సావిత్రమ్మ. అప్పట్లో కొడుకులిద్దరూ ఆమెను ఓదార్చారు. ధైర్యం చెప్పారు. ఆదరించారు. ఆ ఆదరణతోనే ఆమె కోలుకోగలిగింది.



సాంబమూర్తి పోయిం తర్వాత ఆయన తాలూకు పెన్షన్ డబ్బు సావిత్రమ్మ పేరిట వచ్చేది. ఆ డబ్బును ఆమె సుందర్రావు చేతికిచ్చి బ్యాంకులో జమ చేయమనేది. తరువాత అప్పడప్పుడూ మనవళ్ళకు బట్టలకనీ,కొడుకు, కోడళ్ళకు కావలసిన వస్తువులు కొనుక్కోమనీ బ్యాంకులోంచి డబ్బు తీసుకోమని చెప్పేది. చెక్కులో సంతకం పెట్టడం తప్ప మిగతా పనులు సుందర్రావే చేసేవాడు. డబ్బువద్దనేవాడు కాడు. ఆ రకంగా కొన్ని నెలలు గడిచాక సావిత్రమ్మకు జ్వరం వచ్చి పది రోజులు మంచం పట్టింది. అప్పుడు డాక్టరుకనీ, మందులకనీ డబ్బు ఖర్చు పెట్టాడు సుందర్రావు. మెల్లగా సావిత్రమ్మ కోలుకుంది. అప్పుడే ఇంట్లో సణుగుడు ప్రారంభమైంది.

"ఎంత డబ్బువచ్చినా ఈ ఇంటికి చాలడం లేదు. పైగా జబ్బులు రోగాలు. ఈ రోజుల్లో డాక్టర్ల ఖర్చులంటే మాటలా. వందలకు వందలు, వేలకు వేలు. ఖర్చు.." అంటూ కోడలు సత్యవతి దండకం ప్రారంభించింది. ఆ మాటలు సావిత్రమ్మ చెవిలో పడడమే కాదు మనసు మీద సూదుల్లా గుచ్చుకున్నాయి. ఆమెలో అలజడి ప్రారంభమైంది. నిజమే. తను జబ్బు పడింది. నిజమే. సుందర్రావు డబ్బు ఖర్చు పెట్టాడు. కానీ ఎవరి కోసం పెట్టాడు. కన్నతల్లి కోసం. దానికింత రాద్ధాంతం చెయ్యాలా? అనుకుంది సావిత్రమ్మ. మొదటి సారిగా ఆమె మనసులో తను తన కొడుకూ కోడళ్ళకు బరువై పోయానా అనే ఆలోచన వచ్చింది. అవును.. తన బరువును మోయవలసిన భర్త తనకన్నా ముందే పోయాడు. ఆయన గడించి పెట్టినన్నాళ్ళు తను బాగానే బ్రతికింది. పిల్లలు సంతోషంగా పెరిగారు. ఇప్పుడు వాళ్ళు గడించి వాళ్ళ పిల్లల్ని బ్రతికిస్తారు. అంతే కానీ ఈ దశలో తన వల్ల వాళ్ళకేం లాభం? శారీరకంగా అలసిపోయిన వృద్ధురాలు. అటు ఇంటికి పనికిరాదు. ఇటు ఖర్చులకే పనికి వస్తుంది. "ఈ దశలో ఏవగింపులు తప్పవు కదా" అనుకుంది సావిత్రమ్మ.

"మోడువారిన చెట్టునూ పాలివ్వని ఆవునూ బీడువారిన భూమినీ ఎవ్వరూ పట్టించుకోరు. వాటిని చేర్చవలసిన చోటుకే చేరుస్తారు. అయినా తానింకా పూర్తిగా పాలివ్వని ఆవు కాలేదు. భర్త పెన్షన్ వస్తూంది. ఆ పాలను తన కొడుకుకే ఇస్తే కాస్త కనికరం చూపిస్తాడు" అనుకుంది సావిత్రమ్మ. ప్రతి మనిషికీ జీవితంలో నానాటికీ అవసరాలు పెరిగిపోతున్న ఈ కాలంలో కోరికలకీ, బాంధవ్యాలకీ మధ్య ఘర్షణ ప్రారంభమైన సమయం ఇది. అనుకుందామె.

సాయంత్రం సుందర్రావు ఆఫీసు నుంచి రాగానే కాసేపయ్యాక మెల్లగా అతన్ని పిల్చి "ఒరేయ్ బాబూ! నీ కష్టం నాకర్థమైంది. నా జబ్బు కోసం నువ్వు డబ్బు ఖర్చుపెట్టి బాధపడుతున్నావు కదా. నిన్ను బాధ పెట్టి బ్రతకడం నాకిష్టం లేదు. అందుకే ఈ నెల నుంచి మీ నాన్న పెన్షన్ డబ్బులు నువ్వే తీసుకో" అంది సావిత్రమ్మ. సుందర్రావు కాస్త తటపటాయించినా "సరే.." అని తన అంగీకారం తెలిపాడు. దాంతోబాటు "అయినా.. ఆ డబ్బుతో నువ్వేం చేస్తావులే" అని కూడా అన్నాడు. అంతే కానీ "ఎందుకమ్మా అలాగంటావు. నీ కోసం డబ్బు ఖర్చు పెట్టడం నాకు కష్టం కాదు, అది నా బాధ్యత" అని అనలేదు. అలా అనే కొడుకులు


పద్రుష్టసాయి

తగ్గిపోతున్నారన్న విషయం సావిత్రమ్మకు కూడా తెలుసు. ఆ విధంగా భర్త విడిచి పోయిన పెన్షన్ సావిత్రమ్మ చెయ్యి దాటి పోయింది. వెలవెలా సంతకం పెట్టడమే ఆమె వంతు. డబ్బు మాత్రం కొడుకు వంతు.

పెద్దరికాల విలువలు పోతున్నాయనే నిజం గ్రహించని సావిత్రమ్మ పాపం ఆ ముక్కే కోడలితో మెల్లగా చెప్పింది– కాస్త చనువు తీసుకుని. అంతే సత్యవతి "కస్సు'మని లేచింది. సావిత్రమ్మ వార్ధక్యం ఆమెను నిస్సహాయురాలిని చేసింది.

మరో ఆరు నెలలు గడిచాయి.

తండ్రి పెన్షన్ డబ్బులు కూడా తనకే రావడంతో ఖర్చులు కూడా బాగా పెరిగాయి. దుబారా మొదలైంది. కలర్ టెలివిజన్ కొన్నాడు. వి.సి.ఆర్.కూడా కొన్నాడు. దాని తాలూకు అప్పులు వాయిదాల పద్ధతి మీద కడుతున్నాడు. మళ్ళీ పాత పాటే మొదలైంది. వచ్చిన వస్తువులు పాతబడి కొత్త కోరికలు చిగుళ్ళు తొడిగాయి. "ఎంత డబ్బులొచ్చినా చాలడం లేదు." పాత పల్లవి మళ్ళీ మొదలైంది. మళ్ళీ సావిత్రమ్మ ఆ మాటలు విని ఆలోచనలో పడింది. అసలు "ఎంత డబ్బులొచ్చినా ఎందుకు చాలడం లేదు" అనుకుంది. అవసరాలను మించి ఖర్చుపెడితే చాలదు కదా– ప్రతి బాధ్యతగల మనిషీ తన ఖర్చులకు ఒక హద్దు ఏర్పరచుకుంటే వచ్చిన దాంతోనే బ్రతకడం అసాధ్యం కాదు. తాహతు మించిన మధ్య తరగతే కదా పై పాట పాడేది"అనుకుందామె.



"మేము బాగా బతకాలనుకోవడం చూసి ఓర్వలేకపోతున్నారు. అయినా ఈ ముసలితనంలో కూడా ఈ ఓర్వలేని తనమెందుకూ" అని విరుచుకు పడింది.

"ఔరా! తనేం కాని మాటలాడలేదే. తన భర్త ఎన్నడూ తాహతకు మించి బ్రతకలేదు. అప్పులు చెయ్యలేదు. అవసరాలను అదుపులో వుంచుకుని ఎవరికీ ఏ లోటు లేనంత మంచిగానే తన ఆదాయంతో సంసారం నడుపుకు వచ్చాడు. అలాంటిది కొడుకు అప్పులు చేసి డబ్బులు చాలదంటూంటే ఇంకా వాడు చిన్నవాడే నన్న భావనతో ఓ మంచి సలహా చెప్పింది. అంతే కానీ మారిన కాలంలో మాట విలువ కూడా తారు మారవుతూందని ఆమెకు తెలీదు. పూర్వకాలం మనిషి,

పర్యవసానం. రాత్రి కొడుకు వచ్చిం తర్వాత తల్లీ కొడుకుల మధ్యఘర్షణ జరిగింది.

"చూడమ్మా! నేనొక్కడినే సంపాదించి ఇంటి బరువు మొత్తం లాగుతున్నాను. నాకూ ఇద్దరు పిల్లలున్నారు. మీ తరం వేరు. మా తరం వేరు. అప్పటి జీవన విధానం వేరు. ఇప్పటి విధానం వేరు. మీలాగా మేము బ్రతకడం సాధ్యం కాదు. మోసే వాడికి తెలుసు బరువు" బరువు అనే మాటను వత్తి పలుకుతూ అన్నాడు సుందర్రావు.

వాడి మాటల్లోని అంతరార్థం పసిగట్టింది సావిత్రమ్మ. అంతే తనను బరువు అనుకుంటున్నాడన్న మాట అనుకుంది. కానీ తనది ఏమీ చెయ్యలేని పరిస్థితి. వృద్ధాప్యం ఉచ్చు బిగించేసింది. మౌనంగా లేచి మంచం క్రింది పెట్టె ముందుకు జరిపింది అతి కష్టం మీద కొడుకును పిలిచింది.

"చూడరా సుందరం! ఈ వెండి సామాన్లు తీసుకో– ఇవి మీ నాన్న కష్టపడి సంపాదించి నవి.

ఆయన గుర్తుగా వీటిని భద్రపరిచాన్రా. కానీ వీటితో నాకేం పనుంది కనుక. అయితే దీన్ని మాత్రం అమ్మకు. నీ పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. కాలక్రమేణ వీటి విలువ పెరుగుతుందే కానీ తరగదు" అన్నది ఆ పెట్టెను సుందర్రావుకు ఇస్తూ.

సుందర్రావు మాట్లాడలేదు. పెట్టె తీసుకు వెళ్ళి పోయాడు. మరో వారం గడిచింది. ఇంట్లో వాషింగ్ మిషన్‌వచ్చింది. సావిత్రమ్మకు ఆశ్చర్యం వేసింది.

"ఢబ్బు చాలడం లేదు... చాలడం లేదు అని మొత్తుకుంటున్నారు. మరి ఈ మిషనెలా వచ్చిందో" అనుకుంది ఆమె. వుండబట్టలేక ఆ ముక్కే కోడలిని అడిగేసిందావిడ. "మీరిచ్చారుగా వెండి సామాన్లు.అవి అమ్మి ఇది కొన్నాము" అంది కోడలు.

"అమ్మేశారా" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రమ్మ.

"లేకపోతే.. అయినా ఇంటిల్లపాది బట్టలూ ఎవరుతుకుతారు? మీరా పనికిరారు. నాకా ఓపిక లేదు. ఈ మిషన్ వుంటే క్షణాల్లో పనైపోతుంది. ఇది మీ కాలం కాదు. నూతి దగ్గర కూర్చుని వుతుక్కోడానికి" వెక్కిరింపుగా అంది కోడలు.

సావిత్రమ్మ గుండె మీద ఎవరో బలంగా గుద్దినట్లనిపించింది. రూపాయి రూపాయి కూడబెట్టి ఆ వెండి సామాను కొన్నాడు సాంబమూర్తి. ఆయన జ్ఞాపకార్థం దాచుకున్న ఆ సామాన్లు కూడా పోయాయి. మొదట పెన్షన్ పోయింది. తరువాత వెండి సామాన్లు, కానీ తను మాత్రం బరువుగానే మిగిలిపోయింది సావిత్రమ్మ.

'ఈ దశలో ఇవ్వదు ఇవ్వడానికేముంది?'

అనుకున్నప్పుడు మెడలోని బంగారు గొలుసు అడిగాడు కొడుకు.

ఇది తన భర్త కొన్నది. చివరిదాకా తనతోనే వుండాలనుకుంది ఆమె.

ఇస్తే ఇది కూడా రెండ్రోజుల్లో మరో వస్తువుగా మారిపోతుంది.

వెండి బంగారు...ఆస్తి.. వస్తువులు..కర్పూరం.

ఆ నిజం ఈ తరం వారికి అర్థమవదు.

నీటి విలువ నీటిదే. అది కరిగిపోదు. ఐసు విలువ ఐసుదే కానీ కరిగిపోతే పనికిరాదు.

మరో వారం రోజుల్లో దీపావళి అనగా "ఖర్చుకు డబ్బు కావాల"ని మళ్ళీ గొలుసు అడిగాడు కొడుకు.

రాత్రంతా ఆలోచించింది సావిత్రమ్మ.

ఉదయం లేచి సుందర్రావు చేతిలో గొలుసు పెట్టింది.




అన్నము

ఒకసారి ఓ తెలుగు మాస్టారికి సందేహం వచ్చిందట. "అన్నము అనే మాట తెలుగా? సంస్కృతమా?" అని. అది విన్న విశ్వనాథవారు "అది కూడా తెలియకుండా వాడు అన్నమెలా తింటున్నాడ్రా" అని చమత్కరించారట.

సేకరణ: వై. శరత్‌చంద్రశేఖర్, కర్నూలు.

సుందర్రావు మొహం కళకళలాడంది.

సావిత్రమ్మ మొహం పాలిపోయింది.

తన ఆఖరి ఆస్తి కూడా ఇచ్చేసింది.

మరింక ఇవ్వడానికేమీ లేదు.

ఆ ముక్కే సుందర్రావుతో చెప్పింది

"సుందరం! నాకు మీ నాన్న ఇచ్చి వెళ్ళినవన్నీ ఇచ్చేశాను. ఇంక ఇవ్వడానికేమీ లేదు. నీకు నేను బరువనిపిస్తే చిటికెడు విషం ఇచ్చేయ్" అంది మనసులోని దుఃఖాన్ని దిగమ్రింగుకోలేక.

సుందర్రావు మనసు కోపంతో కుతకుతలాడింది.

"ఆ పని నేనే చెయ్యాలా"అని విసవిస వెళ్ళిపోయాడు.

"అంటే." మళ్ళీ ఆలోచించింది సావిత్రమ్మ.

ఆలోచించిన కొద్దీ ఆమె శరీరం చల్లబడిపోతూంది. చేతులు వణికాయి. కాళ్ళువశం తప్పాయి. తన గదిలోనే కుప్పగా కూలిపోయింది.

ఆటుకేసి వచ్చిన మనవడు గిరీష్ మామ్మ అలా పడిపోయి వుండడం చూసి సత్యవతితో చెప్పాడు.

"ఆ ముసలావిడ అంతే. కాసేపయ్యాక లేస్తుందిలే. నువ్వెళ్ళి చదువుకో" క సురుకుంది సత్యవతి.

అరగంట తర్వాత మెల్లగా స్వ హాలోకి వచ్చింది సావిత్రమ్మ. అప్పటికే కొడుకు,కోడలు, పిల్లలు భోజనం చేస్తున్నారు.

"మా అమ్మ లేచిందా" అడుగుతున్నాడు సుందర్రావు.

"లేదు. అయినా ఆ ముసలావిడకు మనం స రదాగా బ్రతకడం బొత్తిగా ఇష్టం లేదు. ఓర్వలేనితనం. కొడుకు కుటుంబం కావలసిన వస్తువులు కొనుక్కుని సంతోషంగా వుండడాన్ని చూసి కుళ్ళుకోవడం ఎక్కడైనా వుంటుందా' ' అంటూంది కోడలు.

"ఆ తరం వాళ్ళంతే వదిలెయ్."

"వదియలేక ఏం చేస్తానూ-వదిలించుకోగలనా ఏం.."? ఎన్నాళ్ళీ తలరాతో" అంటూంది కోడలు.

"పోన్లేవే.. పాపం. వున్నదంతా ఇచ్చేసింది. ఇంకేముందనీ ఏదో వేళకంత పడేస్తే చాలు.. పడుంటుంది" అంటున్నాడు సుందరం.

"అంటే...నన్ను.. ఏ కుక్కతోనో పోలుస్తున్నాడా..! వూహించుకుని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది సావిత్రమ్మ.

"వేళకింత పడేస్తారా?" చిన్నప్పుడు భుజాల మీద వేసుకు తిరిగి ఆకలి వేసినా,వెయ్యక పోయినా రకరకాల వంటలు చేసి రుచిగా పిల్లలకు పెట్టామే. వాళ్ళు కాస్త పెద్దయ్యాక తనకు, తన భర్తకూ లేకపోయినా కన్న పిల్లలకు మాత్రం చేసినదంతా పెట్టి వాళ్ళు తినడం చూసి ఆనందించామే. ఎందుకోసం? ఇలాంటి మాటలు వినడానికేనేమో!" అనుకుంది సావిత్రమ్మ

ఆ రాత్రి టేబిల్‌మీద గిన్నెలో మూత పెట్టిన మజ్జిగ అన్నం బిక్షగాడికి పెట్టిన భిక్షంలా కనిపించిందామెకు.

మనవడు గిరీష్ వాళ్ళ అమ్మను అడిగాడు.

"మామ్మకు కూరలేదా. మనం స్వీట్‌తిన్నాం. మామ్మకు స్వీట్‌లేదా"అని.






"అవి మామ్మ తినకూడదు. తింటే జబ్బు చేస్తుంది. ముసలి వాళ్ళకు అవన్నీ అనవసరం. నువ్వు నోర్మూసుకో.." కసురుకుంది సత్యవతి.

ఆ మాటలు విన్న సావిత్రమ్మ నవ్వుకుంది.

అది వైరాగ్యంతో కూడిన నవ్వు.

"ముసలితనం వస్తే వాళ్ళకు ఆశలు వుండకూడదట వాళ్ళు కావాలనుకున్నవి వాళ్ళు తినకూడదట. జబ్బు రోగం అనే సాకుతో వాళ్ళకు ఏమీ పెట్టరు. వృద్ధాప్యం ముసుగువేసి మనిషిని ఇంట్లోనే వుంచుతూ మనసును బహిష్కరిస్తారు"అనుకుందామె.

ఇంట్లో దీపావళికి ముందు రోజు అందరూ కొత్తబట్టలు చూస్తున్నారు.

సుందర్రావుకు సఫారీ.

గిరీష్‌కు పోలీసు డ్రెస్సు.

సరేష్‌కు జీన్స్ డ్రెస్సు.

కోడలికి కంచి పట్టు చీర.

"మామ్మకు..."అడిగాడు గిరీష్.

ఆవిడకు లేకుండానా" అని కవర్ లోంచి బయటికి తీసి చూపించింది ఒక చీర.

ముదురు పసువు రంగు చీర.

"ఛీ! ఇదా. ఇది మన పనిమనిషి కట్టుకునే చీరలా వుంది యాక్.."అన్నాడు గిరీష్.

"ఏం. పనిమనిషి కడితే.. ఆవిడ కట్టుకోకూడదా. ముసలాళ్ళు పట్టుచీరెలు కట్టుకోనక్కర్లేదు. ఇంట్లో పడుండడానికివి చాల్లే. పెళ్ళిళ్ళా పేరంటాలా" అంది సత్యవతి.

తనకు పసువు కుంకుమలు పోయిన మాట నిజమే.

ముసలితనం వచ్చిన మాట నిజమే.

కానీ ముసలివాళ్ళు పట్టు చీరెలు కట్టుకోనక్కర్లేదన్నమాట న్యాయం కాదు. ముసలి వాళ్ళకు మంచి చీరెలు కట్టుకోవాలనే ఆశలుండవా ముసలితనం శరీరానికే గానీ మనసుకు కాదు. ముసలితనం వచ్చిన వాళ్ళు బహిష్కృతులు కారు.


కానీ ఈతరంలో చాలా మంది ఎందుకో వృద్ధులను తమలో ఒకరుగా స్వీకరించకుండా వెలివేసి వుంచుతారు.

మంచి ఆహారం వాళ్ళకు అక్కర్లేదు.

మంచి బట్టలు వాళ్ళకు అక్కర్లేదు.

సరదాగా పిల్లలతో సినిమాకో, బీచ్‌కో, పార్క్‌కో వెళ్ళేటప్పుడు ముసలి వాళ్ళను తీసుకు వెళ్ళరు. వాళ్ళు వేగంగా నడవలేరనో, నడిస్తే కాళ్ళునెప్పి పుట్టి మళ్ళీ డాక్టరు ఖర్చులు పెరుగుతాయనో ముందు జాగ్రత్తగా వాళ్ళను ఇంట్లోనే వుండి పొమ్మంటారు. అటక మీదికి ఎక్కిన పాత సామాను కథ అవుతుంది వాళ్ళ జీవితాలు.

"ఒక తరం నుంచి మరొక తరాన్ని దూరం చేయడానికేనా వస్తుంది వార్ధక్యం." అనుకుంది సావిత్రమ్మ.



## అవాస్తవిక చిత్రాలు

[సంబోధన సరిగ్గా కుదరక
రాసి ఉండచుట్టి పారేసిన ఉల్లిపొర కాయితపు ఉత్తరాలన్నీ
కాలంలో బండరాళ్ళల్లా పడి దొర్లుకుంటూపోతున్నాయి]
[చంద్రుడి మీద ఎడమ పాదం
పెట్టిననాడే తెలిసిపోయింది దేవుడు నిస్సంతువుగా
చచ్చిపోయి తన విగ్రహం కోసం దేవుళ్ళాడుకొంటున్నాడని]
[పియానో మెట్లమీద
అడ్డంగా స్పృహతప్పి పడిపోయివుంది వాయులీనం కమాను
గోరింటాకు పెట్టుకున్న చేతి మరకల్తో పులిమేసి]
[పూర్వం జ్వరమొచ్చినప్పుడల్లా
చందమామ నిమ్మతొన చప్పరిస్తోండేవాడల్లా బిల్ క్లింటన్
ఓ చిన్న కండోమినియంలో కూచుని కండోమ్‌ల్లో పాలు తాగుతున్నాడు]
[పోతులూరి వీరబ్రహ్మంగారూ
జార్జ్‌ఆర్వెల్‌గారూ ఆల్విన్ టాఫ్లర్‌గారూ సిగ్మండ్ ఫ్రాయిడ్‌గారూ
నలుగురూ ఒక్కరే అయిపోయి చతుర్ముఖంతో పేషెన్స్ ఆడుకుంటున్నారు]
[సంతకం సరిగ్గా దొంగతనం చేయలేని
ఆకాశరామన్న ఉత్తరపు ఉల్లిపొర కాయితం చీకట్లో లేని అందమైన
నల్లపిల్లలా గురుత్వాకర్షణని ఛేదించుకొని చందమామపైకి దొర్లిపోయింది]
[అంతర్జాతీయ విమానాశ్రయంలో
దేవుణ్ణి పట్టుకుంటే 'అయ్ హావ్ నథింగ్ టు డిక్లేర్' అన్నవాడి మూడో కాలు
నాలుగో జోబీలో కేవలం మూడు కిలోల దొంగ ప్లుటోనియం దొరికింది]
[ఆటుపోటుల సముద్రం మీద
నాటుబోట్ల మీద దొంగచాటుగా క్యూబా వీడి అమెరికా పియానో
మెట్లమీద స్పృహతప్పి పడిపోయాడు కాస్ట్రో చుట్ట మానేసినాక]
[ముఖంమీద కోపవొచ్చి
ముక్కు కోసుకోలేదా మతాలన్నీ రంగురంగుల ఎర్రజండాలన్నీ
నాలోంచి ఎవడో దొంగ వెళిపోతున్నాడు ముందు పట్టుకోండి వాణ్ణి]

— మో

టేబిల్‌మీది మజ్జిగన్నం తిని తన గదిలో చాప మీద ముడుచుకు పడుకుంది. చలికి వణుకుతూ దుప్పటి చినిగి పోయి కప్పుకున్నా పనికిరాని పరిస్థితిలో వుంది. మరో దుప్పటి కూడా ముసలివాళ్ళకు అనవసరమేమో అనుకుంది సావిత్రమ్మ.

ఈ జీవితమేనా తను కలలుగన్నది.

ఆలోచించిన కొద్దీ ఆమె గుండె బరువెక్కి కళ్ళమ్మట జలజల నీళ్ళు కారాయి.

సతీ సహగమనమే మంచిదనిపించిందామెకు.

"ఇలా కన్నబిడ్డ చేతిలో క్షణక్షణం అనురాగం కరువై చావడం కన్నా కట్టుకున్న భర్త ఒడిలోనే చావడం అదృష్టమే కదా"అనుకుంది.

ఆలోచిస్తూ నిద్ర ఒడిలోకి జారి పోయింది సావిత్రమ్మ.

మర్నాడు ఉదయం ఇంకా దట్టమైన చీకటి తెరలు క్రమ్ముకున్న సమయంలోనే టపాకాయల చప్పుడు వినిపించి లేచిందామె.

చీకట్లో తారాజువ్వలు.. చిటపటలు.. మతాబులు.. కాకర పువ్వొత్తులు. చిచ్చుబుడ్లు.. ఎటు చూసినా వెలుగు దివ్వెలు. దివ్వె వెలిగినప్పుడు చీకటి పటాపంచలవుతూంది. దివ్వె ఆరినప్పుడు చీకటి మళ్ళీ రాజ్యమేలుతూంది.

వెలిగే దివ్వెలకేసి రెప్ప ఆర్పకుండా చూస్తూంది సావిత్రమ్మ.

ఆమె మస్తిష్కంలో ఒక దివ్వె వెలిగింది. తిమిరం. ఒక శత్రువు. తన జీవిత తిమిరాన్ని పారద్రోలడానికి తనే ఒక దివ్వెగా మారాలి. వార్ధక్యం అనే శత్రువును దివ్వె అనే మనసులో జయించాలి.

అంతకన్నా ముందుగా తనను బరువుగా భావించే వారి నుంచి దూరమై తనే తన బరువును వదిలించుకున్నాననుకోవాలి. పక్షికి ఒకే గూడు శాశ్వతం కాదు. గాలికి ఒకే కొమ్మ శాశ్వతం కాదు "అలాగే మనిషికి కూడా"అనే మార్పు రావాలి. ఈ దీపావళి తనలో కొత్త వెలుగు తేవాలి"అనుకుంది సావిత్రమ్మ.

పండగ పూట కూడా టపాకాయల చప్పుళ్ళతోబాటు కోడలి దిగదుడుపులు కూడా చోటు చేసుకున్నాయి.

కానీ ఇదివరకటిలా సావిత్రమ్మ కృంగిపోలేదు.

మరో వారంరోజులు గడిచిపోయాయి.

ఒక రోజు ఉదయం సుందర్రావు ఆఫీసుకు బయలుదేరుతుండగా చేతిలో ట్రంకు పెట్టెతో బయటికి వచ్చిన తల్లిని చూసి "ఎక్కడికి బయల్దేరావు"అని అడిగాడు సుందర్రావు.

"వృద్ధుల సంక్షేమ కేంద్రానికి" మెల్లగా బొంగురు గొంతుతో చెప్పింది సావిత్రమ్మ.

"ఎందుకు" ఆశ్చర్యంగా అడిగాడు సుందర్రావు.

"ఇన్నాళ్ళు నీ బరువు మోశాను. నాకు ముసలితనం వచ్చింది కదా. మరింక మోసే శక్తి లేదు బాబూ. నా బరువే నేను మోసుకోవాలి. కనుక నీ చేత నా బరువు మోయించడం నా కిష్టం లేక నేనే వెళ్ళిపోతున్నాను"అంది సావిత్రమ్మ.

"అక్కడ నిన్ను వూరికే చూసుకోరు. డబ్బు కట్టాలి. తెలుసా"అడిగాడు సుందర్రావు.

"తెలుసు. బాగా తెలుసు. ఎక్కడైతేనేం. డబ్బు కట్టే బ్రతకాలి. మీ నాన్న సంపాదించిన వెండి, బంగారం అన్నీ నీ చేతుల్లో పెట్టి కరిగించేశాను. కానీ ఆయన చేసిన మంచి పని పెన్షన్ నా పేరిట రాయడం. అది నా చేతిలో వుంది. ఆ డబ్బు చాలురా, నా బరువు మోయడానికి ఎవరో ఒకరు కొరివి పెట్టకపోరు. మీ అన్నదమ్ములు రాకపోతేనేం? నువ్వు ఆ కష్టం కూడా పడవద్దు. నా దారి నేను చూసుకుంటాను. కానీ.. నీ దారి నువ్వు జాగ్రత్తగా చూసుకో.. నీకూ ఇద్దరు కొడుకులున్నారు. మీ నాన్న నడిచిన దారిలో నేను నడిచాను. నా మాటను ఆయన గౌరవించారు. అనురాగం, ఆత్మీయత పిల్లలకు పంచి పెడుతూ మా పెద్దలను చివరి దాకా మంచిగా చూసుకున్నాము. కానీ మీరు.. ప్చ్... ఉచ్చు బిగుసుకోక ముందే జాగ్రత్తపడు" అంటూ విసవిస నడిచింది సావిత్రమ్మ. వయసు ఆమె ముందు ఓడిపోయింది.

ఊహించని ఆ పరిణామానికి నిశ్చేష్టులై నిలబడిపోయారు సుందర్రావు, సత్యవతులు. అంతలోనే కనుచూపు మేరకు వెళ్ళిపోయిన సావిత్రమ్మ దూరంగా పంజరం నుంచి బయట పడిన పక్షిలా వెళ్ళిపోతూంది.

ముసలితనం అనే పంజరంలోంచి
ఆమె మనసు విముక్తి పొందింది.


రుచికరమైన అభినవ పోషకాహారం
చక్కటి అభిరుచికి నిదర్శనం............

బోనీమిక్స్‌తో రోజంతాశక్తి, అనుక్షణం ఉరకలు వేసే ఉత్సాహం, బోనీమిక్స్ పౌష్టికాహారము రుచికరమైన పండ్లు,ఫలములు, శక్తివంతమైన ధాన్యసారములు, విటమిన్లు కలిగి ఉన్నది.
రోజానా 100% ప్రొటీన్‌యుక్త పరిపూర్ణ శాఖాహారం. రోజానా తో మీరు ఊహించగల్గినన్ని ఎన్నో రుచికరమైన వంటకాలు తయారుచేసుకోవచ్చును. ఇప్పుడు మీ అభిమాన దుకాణంలో లభ్యం.

VEEYES




HF
Hindustan Foods Ltd.
Dempo House, Campal, Panaji - Goa. 403 001.
Tel.: (832) 223256, 224556 Fax: (832) 225098

CONTAINS NO ARTIFICIAL FLAVOUR OR COLOUR

